



సచివాలయం ముందు నిరసన తెలుపుతున్న ఇంటి యజమాని నాగరాజు

అద్దె చెల్లించలేదని సచివాలయ భవనానికి తాళం

ప్రజాశక్తి-హిందూపురం

పరిపాలన సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. అయితే ఈ వ్యవస్థ తీసుకువచ్చి నాలుగు సంవత్సరాలు గడిచినప్పటికీ ఇంకా గాడిలో పడలేదు. సచివాలయ వ్యవస్థ ప్రారంభం సమయంలో పురపాలక సంఘంలో సచివాలయాలను ప్రారంభించడానికి భవనాలు లేకపోవడంతో కొన్ని ప్రాంతాలలో పాఠశాల భవనాలలో సచివాలయాలను ప్రారంభించారు. దీంతో సుప్రీం కోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి అక్షింతలు వేయడంతో పాఠశాలలో ప్రారంభించిన సచివాలయాలను వెంటనే ఖాళీ చేసి అద్దె భవనాల్లోకి మార్చారు. అయితే ఆ అద్దెలను చెల్లించని స్థితిలో హిందూపురం పురపాలక సంఘం ఉంది. హిందూపురం పురపాలక సంఘంలో 43 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 9 సచివాలయాలు అద్దె భవనాల్లో ఉన్నాయి. 3వ వార్డు ఆర్టీసీ కాలనీ, 4వ వార్డు త్యాగరాజు నగర్, సడ్లపల్లి, సూగురు, మోతకుపల్లి, ఆజాద్ నగర్, అరవింద నగర్, అహ్మద్ నగర్, సింగిరెడ్డిపల్లి ప్రాంతాలలో ఉన్న సచివాలయాలు అద్దెనివాసాల్లో ఉన్నాయి. ఇందులో ఆర్టీసీ కాలనీ నాల్గవ వార్డు సచివాలయానికి నాగరాజు తన భవనాన్ని అద్దెకు ఇచ్చాడు. అయితే ఆ భవనానికి నాలుగు నెలలుగా అద్దె చెల్లించలేదని ఇంటి యజమాని నాగరాజు సచివాలయానికి శుక్రవారం తాళం వేసి, భవనం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ సచివాలయానికి సంబంధించి అద్దె చెల్లించాలని మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరిగినప్పటికీ ఏ ఒక్కరు కూడా స్పందించలేదన్నారు. దీంతో విధి లేని పరిస్థితిలో సచివాలయానికి తాళం వేశానన్నారు. చెల్లించాల్సిన అద్దె మొత్తం చెల్లించి సచివాలయాన్ని వెంటనే ఖాళీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో హల్ చల్ చేయడంతో పురపాలక సంఘం అధికారులు అప్రమత్తమయ్యారు. ఆ యజమానిని వెంటనే పిలిపించి చెల్లించాల్సిన నాలుగు నెలల అద్దెకు సంబందించి రూ. 24వేలను చెక్కు రూపంలో అందించారు. అదే విధంగా ఈ సచివాలయంతో పాటు మిగిలిన సచివాలయాలకు ఇవ్వాల్సిన అద్దెలు మొత్తం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ చెక్కు రూపంలో అందరికీ అందించారు.

యూట్యూబ్ రేటింగ్ పేరుతో మోసం

ఐదుగురు సైబర్ నేరగాళ్ల అరెస్టు
ఫేక్ అకౌంట్ల ద్వారా దుబాయ్‌లో డబ్బులు డ్రా
మీడియా సమావేశంలో ఎస్పీ అన్బురాజన్ వెల్లడి





సైబర్ నేరగాళ్ల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అన్బురాజన్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తాము పంపిన యూటూబ్‌ను సబ్‌స్క్రైబ్ చేసి రేటింగు ఇచ్చినందుకు కమీషన్ల రూపంలో లక్షల ఆదాయం వస్తుందని చెప్పి మోసగించే సైబర్ నేరగాళ్లను అనంతపురం జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ఐదుగురిని అరెస్టు చేసి కటకటలా వెనక్కు పంపారు. దీనిఅసలు కింగ్‌పిన్ దుబాయ్‌లో ఉన్నట్టు గుర్తించారు. దీనికి సంబంధించిన వివరాలను అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ముందుగా డబ్బులు చెల్లిస్తే తాము యూబూట్ వీడియోలను పంపుతామనివాటిని సబ్‌స్క్రైబ్ చేసి రేటింగు ఇస్తే అందుకు కమీషన్ వస్తుందని సైబర్ నేరగాళ్లు నమ్మబలుకుతారు. ఆ రకంగా మొదట్లో కొంత డబ్బును కమీషన్ రూపంలో ఇస్తారు. ఆ తరువాత డబ్బులు వేయించుకుని యూటూబ్ వీడియోలు పంపకుండా ఆపేసి డబ్బులను ఫేక్ అకౌంట్ల ద్వారా దుబాయ్‌కు తరలించి, అక్కడ డ్రా చేస్తారు.

బయటపడింది ఇలా...

అనంతపురం జిల్లా గార్లదిన్నెలో అనిల్‌కుమార్ అనే ప్రయివేటు చిరుద్యోగికి సైబర్ నేరాగాళ్లు మోసం చేశారు. టెలిగ్రాం మెసెంజర్‌లో ఈ ఏడాది సెప్టెంబరు 21వ తేదీన అనిల్‌కుమార్‌కు శ్వేత శర్మ పేరున లింకు వచ్చింది. డిజిటల్ వర్కులో పార్టుటైమ్ జాబ్ చేస్తే అదనపు ఆదాయం వస్తుందని ఆ మెసెంజరు సారాంశాన్ని దీన్ని చూసి ఆసక్తి చూపిన అనిల్‌కుమార్ వారి సూచనల మేరకు నిర్వాణ డిజిటల్ గ్రూపులో యాడ్ అయ్యాడు. ఈయనకు ప్రత్యేకంగా యూజర్ ఐడిని ఇచ్చారు. రూ.10 వేలు డబ్బులు కడితే వీడియోలు పంపుతామని దానికి సబ్‌స్క్రైబ్ చేసి రేటింగు ఇస్తే కమీషన్ వస్తుందని నమ్మించారు. తన వద్ద డబ్బుల్లేవంటే మొదట తామే చెల్లిస్తామని చెప్పి వీడియాలు పంపారు. దాన్ని అనిల్‌కుమార్ సబ్‌స్క్రైబ్ చేసి రేటింగు ఇచ్చాడు. దానికి రూ.800 కమీషన్ రూపంలో ఇచ్చారు. దీన్ని చూసి పది వేల రూపాయలు చెల్లిస్తే మరో వీడియో పంపుతామని చెప్పడంతో ఈసారి తానే స్వయంగా పది వేల రూపాయలు చెల్లించాడు. ఈసారి రూ.2625 కమీషన్ వచ్చింది. కమీషన్ పెరుగుతుండటంతో ఈసారి రూ.50,500 పంపమని సైబర్ నేరగాళ్లు అడిగారు. కమీషన్ వస్తోందన్న ఆశతో అడిగినంత డబ్బు చెల్లించాడు. ఎక్స్‌క్లూజీవ్ డేటా అని చూపించి ఈసారి కమీషన్ ఇవ్వకుండా హోల్డ్‌లో పెట్టారు. రూ.1.50 లక్ష కడితే మరిన్ని వీడియోలు పంపుతామని చెప్పడంతో ఆ డబ్బును చెల్లించాడు. ఆ తరువాత కూడా కమీషన్ రాలేదు. ఎందుకు రాలేదని ప్రశ్నిస్తే ఈసారి రూ.4.99 లక్షలు కడితే కమీషన్ వస్తుందని చెప్పాడు. అంత డబ్బు కట్టలేనని చెప్పడంతో ఐడిని బ్లాక్ చేశారు. దీంతో తాను మోసపోయానని భావించిన అనిల్‌కుమార్ సైబర్ పోర్టల్ 1930కి ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు ఆధారంగా గార్లదిన్నె పోలీసులు దర్యాప్తును చేపట్టారు.

విచారణలో విస్తుగొలిపే విషయాలు

దీన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు విచారణ చేపడితే అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీనికి ఉత్తర భారతదేశానికి చెందిన ఒక వ్యక్తి అసలు సూత్రధారిగా ఉన్నాడు. ఈయన దుబాయ్‌లో ఉంటాడు. ఇక్కడ కొద్ది మందిని నియమించుకుని వారి ద్వారా అమాయకులకు వలవేయడం డబ్బులు తమ ఖాతాల్లో వేయించుకుని క్రిప్టో కరెన్సీ రూపంలో దుబాయ్‌కు తరలించి అక్కడ డ్రా చేసుకుంటున్నారు. ఇందుకు ఇక్కడ పనిచేసే వారికి ఒక్క శాతం కమీషన్ ఇస్తున్నారు. ఎన్‌సిఆర్‌బి పోర్టల్‌లో మొత్తం 1550 ఫిర్యాదులు ఈ రకమైనవి అందాయి. సుమారు 172 ఫేక్ అకౌంట్ల నుంచి రూ.350 కోట్లకుపైగా దుబాయ్‌కు తరలించినట్టు అంచనా. ఈ విచారణలో అనంతపురం జిల్లా పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. వారికి కమీషన్‌లో రూపంలోనే రూ.20 లక్షలు అందినట్టు గుర్తించారు. ఇప్పటి వరకు జరిపిన విచారణ వరకు 16 ఫేక్ అకౌంట్లను గుర్తించి ఫ్రీజ్ చేయించారు.

అరెస్టు అయిన వారి వివరాలు

తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన మహమ్మద్ సమ్మద్, అదే జిల్లా వెంకటగిరికి చెందిన వెంకటాచలం, అనంతపురం నగరానికి చెందిన సంధ్యారాణి, ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన అజయ్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన ఎం.సందీప్ అరెస్టు అయిన వారిలోనున్నారు.

గంజాయి విక్రేతలు అరెస్టు

3.5 కిలోలు గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరంలో గంజాయి విక్రేయించే ముఠాను అనంతపురం పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 3.50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసు కాన్ఫరెన్సు హాలులో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ అన్బురాజన్ వెల్లడించారు. అనంతపురం నగరంలోని భవాని నగర్‌లో ఉండే షేక్ సోనూ అనే మహిళ నుంచి శివ శంకర్ నాయక్, బోయ నరేష్‌లు నగరంలోని మిర్చి యార్డు వద్ద గంజాయి కొనుగోలు చేస్తుండగా వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 3.50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. భవానినగర్‌కు చెందిన షేక్ సోనూ భర్త యాక్సిటెండ్‌లో మృతిచెందాడు. దీంతో ఆమె పుట్టింట్లో ఉంటోంది. తమ్ముడు బాబా ఫకృద్దీన్ గంజాయి వ్యాపారం చేస్తూ ఇటీవలనే పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ నేపథ్యంలో సులభంగా ఈ వ్యాపారం ద్వారా డబ్బులు సంపాదించవచ్చునని భావించిన సోనూ ట్రైనులో కాకినాడ జిల్లా తునికెళ్లి, అక్కడ కిలో రూ.10 వేలకు గంజాయిను కొనుగోలు చేసి తెచ్చింది. దీన్ని ఇక్కడ కిలో రూ.15 వేల నుంచి రూ.20 వేలకు విక్రయిస్తోంది. ఈ నేపథ్యంలో ఆమె నుంచి ఆత్మకూరు మండలం వేపచెర్ల గ్రామానికి చెందిన దొంగావత్ శివశంకర్ నాయక్, గుత్తికి చెందిన పీరం గణేశ్ కొనుగోలు చేస్తుండగా ముగ్గురిని పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు ఈ కేసును చేధించిన వన్‌టౌన్ సిఐ రెడ్డప్ప, ఎస్ఐ పి.వెంకటేశ్వర్లు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

బాలికకు సంపూర్ణ న్యాయం చేయాలి

దాష్టీకానికి పాల్పడిన ఎపిపి దంపతులపై చర్యలు తీసుకోవాలి - అఖిలపక్షం ఆధ్వర్యంలో సప్తగిరి సర్కిల్‌లో మానవహారం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎపిపి దంపతుల అఘాయిత్యానికి గురైన మైనర్ బాలికకు సంపూర్ణ న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదని అఖిలపక్షం నేతలు స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక సప్తగిరి సర్కిల్‌లో అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు భారీ మానవహారం నిర్మించి నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికపై అతి దుర్మార్గపు హింస జరిగి రోజులు గడుస్తున్నా సంపూర్ణ న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా అరెస్టులకు మాత్రమే పరిమితం కాకుండా తక్షణమే దాష్టీకానికి పాల్పడిన ఏపీపీ దంపతులను పదవుల నుంచి తొలగించాలన్నారు. అలాగే బాలికకు కార్పొరేట్ వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, సిపిఎం నగర నాయకులు ప్రకాష్, వెంకటనారాయణ, ఆవాజ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వలి, ముష్కిన్, నాయకులు షర్మస్, ఫక్ర, సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్‌మొహిద్దీన్, కాంగ్రెస్‌నాయకులు ఇమామ్, టిడిపి నాయకులు ముక్తార్, ప్రజాసంఘం నాయకులు జాకీర్, జనసేన నాయకులు జయరామిరెడ్డి, అంకే ఈశ్వరయ్య, కాంగ్రెస్ నాయకులు ఎంఎండి.ఇమామ్, ప్రజాబలం నాయకులు నజీమ్ బాషా, ఎఐఎంఐఎం షేక్ దాదాపీరా, మెగా శ్యామ్, ఎస్ఎంఎండిఎస్ మసూద్, రఫీ, ప్రజాసంఘాల మహిళా నాయకురాలు శ్యామల, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు కిరణ్‌కుమార్, జయమ్మ, అవుకు విజయ్ కుమార్, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, రొళ్ల భాస్కర్, హుస్సేన్, దరాజ్ బాషా, కెఎల్ఎస్.చోటు, లాల్‌స్వామి, కుమ్మర మురళి, అంజి, సంపత్, ఆకుల అశోక్, వీరమహిళలు అనసూయ, దాసరి సరిత, టిడిపి మహిళా నాయకురాలు, కార్యక్రమాల కమిటీ సభ్యులు సంతోష్, మరియు నాయకులు చిరు, సల్మాన్, విజయ్ దేవరాయల్, నౌషాద్, తదితరులు పాల్గొన్నారు.



మానవహారంలో పాల్గొన్న అఖిలపక్షం నాయకులు

బీసీలకు రక్షణ ఎక్కడ..?

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో ప్రచారం చేస్తున్న వైసిపి బిసిలకు ఎక్కడ రక్షణ కల్పించిందో చెప్పాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాయదుర్గంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల రాయదుర్గం నియోజకవర్గంలో వైసిపి నాయకుల ఆగడాలు, దౌర్జన్యాలు ఎక్కువైపోతున్నాయని ఆరోపించారు. 'ఆరిపోయే దీపానికి వెలుగు ఎక్కువ' అన్న చందంగా ఆరునెలల్లో దిగిపోయే వైసిపి హింసను ప్రేరేపిస్తోందన్నారు. ఇటీవల కణేకల్ మండలంలో వైసిపి నాయకులు బీసీలపై దౌర్జన్యాలు చేశారన్నారు. గరుడచేడు గ్రామంలో కురుబ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీపీ రాజగోపాల్‌రెడ్డికి చెందిన భూమిని మరొకరికి కట్టబెట్టేందుకు ప్రయత్నించగా ఆ వ్యక్తి తనపై కక్షతో తనను ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని,తనకు ఆత్మహత్య శరణ్యమని సీఎంకు వాయిస్ రికార్డింగ్ ద్వారా విజ్ఞప్తి చేశారన్నారు. గురువారం జక్కలవడికి సమీపంలో అదే కురుబ సామాజిక వర్గానికి చెందిన హనుమంతురెడ్డి కుటుంబంపై విచక్షణారహితంగా దాడి చేసి మహిళను ఈడ్చి దౌర్జన్యం చేశారన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సాక్ష్యంగా వెలుగులోకి వచ్చిందన్నారు. సర్పంచి భర్త హనుమంతురెడ్డి కర్ణాటక రాష్ట్రం నుండి అక్రమ మద్యం రవాణా, వ్యాపారం చేస్తుండగా అతడికి కణేకల్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రఘునాథరెడ్డి అండగా ఉన్నారన్నారు. గతంలో కూడా రఘునాథరెడ్డి తమ పార్టీకి సంబంధించిన వారిపై దౌర్జన్యం చేసి వారిపైనే కేసులు పెట్టారన్నారు. ఇటీవల జరిగిన ఈ రెండు ఘటనలకు సంబంధించిన ఆధారాలు వివరాలను జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌కు పంపిస్తామన్నారు. ఈ రెండు ఘటనలకు మూల కారణం జగనన్న భుహక్కు- భూ రక్ష పథకం అన్నారు. భూముల రీసర్వే పేరుతో అనేక ఏళ్లుగా వారి అనుభవంలో ఉన్న భూములను హద్దులు మార్చి ఇతరులకు కట్టబెట్టేందుకు చర్యలు చేస్తున్నారన్నారు. ఈ దుర్మార్గాలు, దౌర్జన్యాల కోసం జగన్ మళ్లీ ఏపీకి సీఎం కావాలా.. అని నిలదీశారు. ఆయా ఘటనలపై దర్యాప్తు చేపట్టి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు, డి.హీరేహాల్ మండల నాయకులు మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'కు పకడ్బందీ ఏర్పాట్లు

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ ఎం.గౌతమి వివరించారు. శుక్రవారం ఢిల్లీ నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా ప్రబరి ఆఫీసర్ సచ్చీంద్రకుమార్ పట్నాయక్, ఐఆర్ఎస్ఎస్ (ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జాయింట్ సెక్రెటరీ ఈక్విలెంట్) వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహణ ఏర్పాట్లపై అనంతపురం, చిత్తూరు జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే జిల్లాస్థాయి, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పంచాయతీ అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈనెల 25 నుంచి జనవరి 24వ తేదీ వరకూ జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. 25న యల్లనూరు మండలం కూచివారిపల్లి, బొప్పేపల్లి గ్రామాల్లో, కుందుర్పి మండలంలోని అప్పిలేపల్లి, కరిగానిపల్లి, గుత్తి మండలంలోని బసినేపల్లి, బసినేపల్లి తండా, కణేకల్ మండలంలోని బ్రహ్మసముద్రం, బెనికల్, గుంతకల్లు మండలంలోని కంగనపల్లి, ఓబులాపురం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఉదయం ఒక గ్రామం, మధ్యాహ్నం ఒక గ్రామంలో యాత్ర ఉంటుందన్నారు. జిల్లాకు రెండు వ్యాన్లు రాగా గుంతకల్లు మండలంలోని కొంగణపల్లి, ఓబుళాపురం గ్రామాలకు ఒకవ్యాన్, కుందుర్పి అప్పిలేపల్లి, కరిగానిపల్లి ఒక వ్యాన్‌ను పంపినట్లు తెలిపారు. మరో మూడు వ్యాన్లు రావాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమం కోసం ఎంపిడిఒలను ఇన్‌ఛార్జిలుగా నియమించినట్లు వివరించారు. జిల్లాలో సజావుగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా ప్రబరి ఆఫీసర్ సచ్చీంద్రకుమార్ పట్నాయక్ మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించేందుకు కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిపిఓ ప్రభాకర్‌రావు, సిపిఓ అశోక్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, ఎఎల్ఎం సత్యరాజ్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నాగరాజ్, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్‌రావు, డిటిడబ్ల్యూఓ అన్నాదొర, డిఇఓ నాగరాజు, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.గౌతమి

8 నుంచి అంగన్వాడీల నిరవధిక సమ్మె

ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిసెంబర్ 8వతేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాజెక్టు కార్యాలయాల కేంద్రాల్లో నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల తెలిపారు. శుక్రవారం రాయదుర్గం ప్రాజెక్టులో వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. స్వయంగా సిఎం జగన్ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని తెలిపారు. అందుకనే తప్పని పరిస్థితుల్లో నిరవధిక సమ్మె చేయాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ స్పందించి అంగన్‌వాడీలకు తెలంగాణ మాదిరి వేతనానికి అదనంగా రూ.వెయ్యి పెంచాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.2లక్షలు ఇవ్వాలని, అంగన్‌వాడీలను ఉద్యోగులుగా గుర్తించాలని, ఐసిడిఎస్ సంస్థను ప్రయివేటుపరం చేసే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తమ సమ్మెలకే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు, ప్రజలు తమ సంపూర్ణ మద్దతు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ సీనియర్ రాయదుర్గం ప్రాజెక్టు కార్యదర్శి మేరీ, నాయకురాలు రాధా, రాధిక, మెహ్రూన్, గోవిందమ్మ, రుద్రమ్మ, అనురాధ, కృష్ణవేణి, రూప, చంద్రకళ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల

మహాసభలు జయప్రదం చేయండి

ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధార్థ

ప్రజాశక్తి-ఉరవకొండ

వచ్చేనెల 6, 7వ తేదీల్లో కళ్యాణదుర్గంలో నిర్వహించనున్న 31 జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధార్థ పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా జిల్లావ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా అనేక కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నాయన్నారు. మరోవైపు ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులు చెల్లిస్తేనే పిల్లలను పాఠశాలలు, కళాశాలల్లోకి పాఠశాలలో అనుమతిస్తామని తల్లిదండ్రులపై మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం ప్రత్యేకమైన కమిటీ ఏర్పాటు చేసి జిల్లావ్యాప్తంగా ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఫీజు ప్రభుత్వమే ఫీజు భరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలు, కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు రూ.10వేలు ప్రత్యేక స్కాలరిషిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సౌకర్యాలైన మంచినీరు, మురుగుదొడ్లు కల్పించాలని, మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలన్నారు. అదేవిధంగా జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన కోసం జాయింట్ అకౌంట్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. డిగ్రీ విద్యార్థులకు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వసతిదీవెన, విద్యాదీవెన సొమ్మును విడుదల చేయాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి జిల్లాలో ఉన్న విద్యార్థులను చైతన్య పరచడం కోసం ఈనెల 31న మేథావులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ ఎస్ఎఫ్ఐ మండల నాయకులు, కార్యదర్శులు హిరణ్య, నందు, సతీష్, వేణు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పేదల అభ్యున్నతే లక్ష్యం

'వై ఏపీ నీడ్స్ జగన్'లో నాయకులు

ప్రజాశక్తి -అనంతపురం

పేదల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రంలో పరిపాలన సాగుతోందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం నవోదయ కాలనీలోని 40వ సచివాలయం, రాజీవ్ కాలనీ-1 సచివాలయం పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు సంబంధించి బోర్డులతోపాటు ఆయా ప్రాంతాల్లో వైసీపీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేర్చామని తెలిపారు. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా చేశామన్నారు. ఆయా పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌ను సిఎంను చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కొగటం విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్‌ఛైర్మన్ ఓబిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు చింతకుంట మధు, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వైసీపీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, కార్పొరేటర్లు సంపంగి రామాంజనేయులు, సైఫుల్లా బేగ్, ఇసాక్, వైసీపీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, వైసీపీ రూరల్ క్లస్టర్ అధ్యక్షుడు హుస్సేన్, సర్పంచ్ ఆశాబీ, ఎంపిటిసి సంధ్య, వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, క్లస్టర్ అధ్యక్షుడు రమణారెడ్డి, వైసీపీ నేతలు మల్లెల వేణుగోపాల్, దౌలా,రహీం, పసులూరు ఓబులేసు, అంజి, రంగయ్య, శీనా, లక్ష్మీనరసమ్మ , హాజరాబి, లీలమ్మ, కరీం తదితరులు పాల్గొన్నారు.



పెద్దపప్పూరు మండలంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు రవిప్రసాద్‌రెడ్డి

ఉరవకొండ : అన్నివర్గాల ప్రజలకూ మేలు జరగాలంటే సిఎం జగన్‌తోనే సాధ్యమని విడపనకల్లు ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చీకులగురికి గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో లబ్ధి పొందిన వివరాలను తెలుపుతూ ఏర్పాటు చేసిన బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, ఇఒఆర్‌డి సత్యబాబు, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ మునాఫ్, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు సుంకన్న, స్కూల్ కమిటీ ఛైర్మన్ గిరిబాబు, ఎంపిటిసి కొత్తపల్లి సురేఖ, చీకులగురికి వైసిపి నాయకులు కొత్తపల్లి మహేష్, మర్రిస్వామి, శ్రీనివాసులు, ఎంఎల్‌ఓ కుళ్లాయిస్వామి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : కులం, మతం, పార్టీలు చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న సిఎం జగన్‌కు మరోసారి అండగా నిలవాని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలం పరిధిలోని దేవుని ఉప్పులపాడు గ్రామంలో 'జగనన్నే ఎందుకు కావాలి' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జన్మభూమి కమిటీలు చెబితేనే సంక్షేమ పథకాలు అందేవన్నారు. అదే నేడు వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు వివరించారు. ఆయా పథకాలు కొనసాగాలంటే తిరిగి జగన్‌ను సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రామిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పెద్దిరెడ్డి, మాజీ మండల అధ్యక్షులు రామ్మూర్తిరెడ్డి, సింగిల్‌విండ్ అధ్యక్షులు అమర్నాథరెడ్డి, నర్సాపురం రామానుజన్‌రెడ్డి, తురకపల్లి శివారెడ్డి, లక్ష్మీరెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, నాగిరెడ్డి, రాంబాబు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అనంతపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

రాయదుర్గం : పట్టణంలోని 18, 19వార్డులకు సంబంధించి 11వ సచివాలయం వద్ద పురపాలక సంఘం అధ్యక్షులు పొరాళుశిల్ప అధ్యక్షతన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి వివరాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. అలాంటి సిఎంకు ప్రతి ఒక్కరూతోడుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మంజునాథ, శారద, మున్సిపల్ వైస్‌ఛైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, వైసిపి పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే డీటీగా ఎం.నరేష్‌కుమార్



ఉరవకొండ : మండల రీసర్వే డీటీగా ఎం.నరేష్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుమ్మగట్ట మండలం నుంచి బదిలీపై ఉరవకొండకు వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు అన్ని గ్రామాల్లో రీసర్వే పకడ్బందీగా చేపడతామన్నారు. రైతులకు అందుబాటులో ఉండిసమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

డిపిఎంఒగా డాక్టర్ రవిశంకర్‌కు ఉద్యోగోన్నతి

నార్పల : మండల పరిధిలోని బి.పప్పూరు ప్రాథమిక వైద్యశాల వైద్యులుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రవిశంకర్‌కు జిల్లా ప్రోగ్రాం మానిటర్ ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతి వచ్చింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైద్యశాల పరిధిలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు వైద్యసేవలు అందించే వైద్యాధికారికి ఉద్యోగోన్నతి లభించడం అభినందనీయమన్నారు. అనంతరం మండలంలోని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, తోటి సిబ్బంది, ప్రజలు డాక్టర్ రవిశంకర్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కులగణన సర్వేపై శిక్షణ


మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ జిల్లా సహాయ అధికారిణి రాధిక

గుత్తి : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ జిల్లా సహాయ అధికారిణి రాధిక ఆధ్వర్యంలో కులగణన సర్వేపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులగణన సర్వే మార్గదర్శకాలు ప్రకారం యాప్ ద్వారా చేయవలసిన విధానాన్ని స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. కులగణన సర్వేకు ప్రజల సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు, టిపిఎస్ మహబూబ్ జాన్, జిల్లా సర్వే అధికారి మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

గుత్తి : పట్టణంలోని బీసీ కాలనీలో బాధితురాలికి ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. కాలనీకి చెందిన పి.అనురాధ అనారోగ్యానికి గురై పలు ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంది. దీంతో కౌన్సిలర్ కె.సుచరిత, వైసీపీ జిల్లా నాయకులు కె. మధుసూదన్ రెడ్డి అనురాధ అనారోగ్య విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2 లక్షలు చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా నాయకుడు క్రషర్ మధుసూదన్ రెడ్డి, నాయకులు సివి.రంగారెడ్డి, శ్రీనివాస యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వైవిఆర్

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన సూచించారు. విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని 1వరోడ్డులో ఉన్న శారద మున్సిపల్ కార్పొరేషన్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం అంటే కేవలం జ్వరం, ఇన్‌ఫెక్షన్‌తో బాధపడటం కాదన్నారు. శారీరక, మానసిక, సామాజిక శ్రేయస్సు స్థితి అన్నారు. ముఖ్యంగా మనం తినే ఆహారం, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అన్నారు. అదేవిధంగా మన ఆలోచనలను ఎలా గ్రహిస్తామో.. ఇతరులతో ఎలా ప్రవర్తిస్తామో అనేది మన మానసిక, సామాజిక ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుంద న్నారు. అనంతరం పౌష్టికాహార ప్రాముఖ్యత, బాలికలకు సంబంధించిన ఆరోగ్య సమస్యల అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఎ.జి.రాజ్‌మోహన్, ఎంఎన్‌టి రాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన

సిఎం జగన్‌తోనే బిసిల అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ముఖ్యమంత్రి జగన్‌తోనే బిసిల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంతోపాటు బూదగవి గ్రామానికి చెందిన 30 వడ్డెర్ల కుటుంబాలు బూదగవి వడ్డే భీమేష్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో వైసిపిలో చేరాయి. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా గతంలో ఏపార్టీ ఇవ్వని విధంగా వడ్డెర్లకు ఎమ్మెల్సీ పదవిని ఇచ్చి చట్టసభల్లో కూర్చోబెట్టిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. పార్టీలో చేరిన వారు కలిసికట్టుగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, మండల సమన్వయకర్త ఓబన్న, విడపనకల్లు జడ్పిటిసి హనుమంతు, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, పట్టణ అధ్యక్షుడు ఏసీ ఎర్రిస్వామి, మాజీ ఎంపీపీ చంద్రమ్మ, జెసిఎస్ కన్వీనర్ ఆసిఫ్, మాజీ ఎంపిటిసి ముష్టూరు వడ్డే లాలుస్వామి, నాయకులు చిరంజీవి, ప్రసాద్, నాగరాజు, బూదగవి శ్రీనివాసులు, జనార్ధనపల్లి మల్లికార్జున, ప్రసాద్‌నాయక్, మోపిడి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


పార్టీలోకి చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

వెంకట్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ

ఇటీవల మృతిచెందిన విడపనకల్ మండలం హంచనహల్ గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి కుటుంబాన్ని వై.విశ్వేశ్వరరెడ్డి పరామర్శించారు. వెంకట్‌రెడ్డి మృతి కుటుంబంతోపాటు పార్టీకీ తీరనిలోటు అన్నారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. పరామర్శించిన వారిలో విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, జడ్పిటిసి హనుమంతు, వైసీపీ సీనియర్ నాయకులు కరణం భీమిరెడ్డి, భీమ్‌రావు, సర్పంచి కేశన్న, వైసీపీ నాయకులు హంపయ్య, అశోక్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మర్రెడ్డి, లక్ష్మన్న, తదితరులు ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న శ్రీచైతన్య రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, పాముదాయి రెసిడెన్షియల్ క్యాంపస్ విద్యార్థులకు రోడ్డు ప్రయాణం-భద్రతపై శుక్రవారం స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ముందుగా పాఠశాల ఆవరణ నుంచి ఆర్టీఓ కార్యాలయం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా హెల్మెట్ ధరించని వాహనదారులకు గులాబీలు ఇచ్చి హెల్మెట్ ధరించాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ అతివేగం మంచిది కాదన్నారు. రోడ్డు నిబంధనలు పాటిస్తూ గమ్యం చేరుకోవడం చాలా ముఖ్యమన్నారు. ముఖ్యంగా యువత వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ఖచ్చితంగా ధరించాలన్నారు. డిటిసి వీరరాజు, ఆర్‌టిఒ సురేష్‌నాయుడు, ఎంవిఐ సునీత మాట్లాడుతూ వాహన చోదకులు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలను నడపరాదన్నారు. అతివేగం వల్ల రేపటి జీవితం ఉండదన్నారు. కావున ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిటిసి వీర్రాజు, శ్రీ చైతన్య బాలికల రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్ సమీనాఖాన్, పాముదాయి ప్రిన్సిపల్ ఇర్షాద్, అకాడమిక్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ షమీనా, అకాడమిక్ కోఆర్డినేటర్ నాగభూషణ్, డీన్ సత్యనారాయణ, సి ఇన్‌ఛార్జి చంద్రమోహన్, డాన్స్ మాస్టర్లు, పీఈటీలు, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న అతిథులు

పెద్దాసుపత్రిలో బాలికకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-అనంతపురం

ఏపీపీ కుటుంబం దాడిలో గాయపడి పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతున్న మైనార్టీ బాలికను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఘటనకు సంబంధించిన వివరాలను బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితురాలికి, కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం బాలిక ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలికను నిర్బంధించి బలవంతంగా పని చేయించుకోవడమే కాకుండా కొట్టి హింసించడం దారుణమన్నారు. చట్టపరంగా నిందితులపై చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బాలికను పరామర్శించిన వారిలో మహిళా కమిషన్ రాష్ట్ర సభ్యురాలు రుఖియాబేగం, రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ గౌసుల్ ఆజం, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీంఅహ్మద్, మేయర్ మహమ్మద్ వసీం, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గౌస్‌బేగ్, మార్కెట్ యార్డు ఛైర్మన్ ఫయాజ్, వక్ఫ్‌బోర్డు జిల్లా ఛైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మెంబర్ ఖాజా, ఖమర్తాజ్, మైనార్టీ సలహాదారు హబీబుల్లా, కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్, రహంతుల్లా, ఇసాక్, బాబా ఫక్రుద్దీన్, వైసీపీ నేతలు వేముల నదీం, తానీషా, మునీరా, కృష్ణవేణి, రఫీ, నియాజ్, తదితరులు ఉన్నారు.


బాలికతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

వికసిత భారత్ సంకల్ప యాత్రపై అవగాహన


మాట్లాడుతున్న ఎంపిడిఒ యోగానందరెడ్డి

పుట్లూరు : వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంపై శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి అధ్యక్షతన మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఒక వాహనం (వ్యాను) పుట్లూరు మండలంలోని ఏ.కొండాపురం గ్రామానికి జనవరి 1న మధ్యాహ్నం చేరుకుంటుందన్నారు. ఈ వాహనం జనవరి 12 వరకూ రోజుకు రెండు పంచాయతీల్లో పర్యటించి అర్హత ఉండి ఎవరైనా పథకం పొందకపోతే వారి నుండి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్‌ప్రసాద్, డాక్టర్ శ్రీవాణి, ఆనందప్రసాద్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యపరీక్షలు


బాధితులను ఆపరేషన్లకు తరలిస్తున్న వైద్యులు

బుక్కరాయసముద్రం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రంలో భాగంగా పలువురికి గురువారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు స్థానిక ప్రభుత్వ వైద్యాధికారిణి తెహరున్నీసాబేగం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమం కింద కంటి ఆపరేషన్ల కోసం గుర్తించిన 15 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. వీరిలో బుక్కరాయసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి 11 మంది, కొర్రపాడు సెంటర్ నుంచి 5 మందిని కడప పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినోద్‌కుమార్, సిహెచ్‌ఓ మోహన్‌రావు, హెల్త్ అసిస్టెంట్లు ధనుంజయ, శివానంద, నాగరాజు, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని గడేహోతూరు ప్రభుత్వ వైద్యాధికారి మారుతి, ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి సూచించారు. శుక్రవారం వజ్రకరూరు మండలం పిసి ప్యాపిలి, కొత్తకోట గ్రామాల్లో ఆరోగ్యశాఖ, గ్రామ పంచాయతీ సిబ్బంది సీజనల్ వ్యాధులు, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం బ్లీచింగ్ పౌడర్ చల్లడమే కాకుండా ఆయా గ్రామాల్లో యాంటీ లార్వా పద్ధతులను పాటించి మురికి కాలువల్లో ఆబెట్ ద్రావణాన్ని పిచికారీ చేశారు. తర్వాత దోమల నివారణకై ఫాగింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచి వి.జ్యోతిబాయి, పంచాయతీ కార్యదర్శులు చాముండి, దాదాపీరా, గడేహోతూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మారుతి, మలేరియా ఉరవకొండ సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి, ఎంపిహెచ్‌ఇఒ విజయ్‌కుమార్, ఎం.కుమార్‌స్వామి, ఎంఎల్‌హెచ్‌పి లక్ష్మీదేవి, ఏఎన్ఎం పద్మ, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

శింగనమల చెరువులో వైభవంగా తెప్పోత్సవం

ప్రజాశక్తి-శింగనమల

శింగనమల రంగరాయల చెరువులో శుక్రవారం వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, భర్త, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరై సీతా ఆత్మారామస్వామి, భూదేవి, శ్రీదేవి సమేత గొలకొండ వెంకటరమణస్వామి, ఆంజనేయ స్వామి, వాసవీమాత విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను రామాలయం నుంచి ఊరేగింపుగా చెరువు వద్దకు తీసుకొచ్చారు. అనంతరం తెప్పపై ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి తెప్పోత్సవం నిర్వహించారు. ఉత్సవానికి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, యువ నాయకులు ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి, ఎపి నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రమీల, ఎంపిపి యోగేశ్వరి, చెరువు ఆయకట్టు ప్రెసిడెంట్ నాగవర్ధన్‌రెడ్డి, కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బుక్కరాయసముద్రం జడ్పిటిసి భాస్కర్, మల్లికార్జున్‌రెడ్డి, బంగారు అలీబాషా, వెంకటరమణ, చెన్నకేశవులు, భక్తులు పాల్గొన్నారు.


తెప్పోత్సవంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దంపతులు

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి : ఎటిఎల్

బెలుగుప్ప : మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో ముందుకు సాగాలని ఆర్‌డిటి ఎటిఎల్ సురేంద్ర, ప్రధానోపాధ్యాయులు వెంకట ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆర్‌డిటి ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు అనంతరం వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పురుషులతోపాటు విద్య, ఉద్యోగాల్లో మహిళలు సమానంగా ఉండాలని సూచించారు. అలాగే బాల్యవివాహాలను అరికట్టేందుకు మహిళలు నడుంబిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ నాగరత్నబాయి, జమేదారు నరసింహులు, సిఓలు సుప్రియ, దుర్గాప్రసాద్, చెన్నరాయుడు, ముత్తన్న, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

మహారాజశ్రీ కర్నూలు జిల్లా ఆదోని రెండవ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో

MVOP NO. 35/2020

జె.శివప్రసాద్ అలియాస్ ఏ.శివకుమార్. ...పిటిషనర్

వర్సెస్

ఎం.శేషన్న మరియు ఇతరులు. ...రెస్పాండెంట్

రెస్పాండెంట్ నెం.3 కు నోటీస్

ఎస్.ఉసేన్ బాష తండ్రి మాదర్‌వలి,
ముస్లీం, **R/O** ఇంటి నెం.20/ **L.I.G** 28,
హౌసింగ్ బోర్డు కాలనీ, గుంతకల్లు,
అనంతపురం జిల్లా. (డ్రైవర్)

పై నెంబర్ లో అర్జీదారుడు అయినా జే.శివ ప్రసాద్ అలియాస్ ఏ. శివకుమార్ తనకు జరిగిన గాయములకు నష్టపరిహారం ఒక లక్ష రూపాయలు ప్రమాదం జరిగిన రోజు నుండి 18% ప్రకారం ఇప్పించమని కోరుతూ అర్జీ దాఖలు చేసినాను. ఇందులో 3వ రెస్పాండెంట్ అయినా మీరు 7-12-2023 న పగలు 10:30 గంటలకు పై కోర్టులో మీరు గాని మీ తరపున న్యాయవాది గాని హాజరై మీకు ఏమైనా ఆక్షేపనలు ఉన్నయెడల తెలుపుకొనలెను. లేనియెడల మీ పైన పరోక్షంగా పై అర్జీని విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వులు మేరకు

ఇ. శ్రీనివాస రెడ్డి
అర్జీపరం అడ్వకేట్,
పత్తికొండ

ప్రశ్నిస్తే కేసులు పెడతామని భయపెడతారా..

ఎస్సీ,ఎస్టీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు రాజశేఖర్

ప్రజాశక్తి-ఉరవకొండ

'గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రశ్నిస్తే పోలీసులను పిలిపించి కేసులు పెడతామని భయపెడతారా..' అంటూ ఎస్సీ ఎస్టీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం డిసిఓతో వాగ్వాదానికి దిగారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను తెలపడానికి జిల్లాకేంద్రంలోని కార్యాలయానికి వచ్చినా అందుబాటులో ఉండడం లేదని, ఫోన్ చేసినా డిసిఓ స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను డిసిఓ దృష్టికి తీసుకురావడానికి విద్యార్థి సంఘాల నాయకులు వస్తే పోలీసులను పిలిపించి భయాందోళనకు గురి చేసే విధంగా వ్యవహరిస్తున్న డిసిఓపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. పోలీసులను పిలిపించి భయపెట్టాలని చూస్తే భయపడేది లేదన్నారు. అనంతరం సమస్యలతో డిసిఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ రాజేష్, పేరెంట్స్ కమిటీ సభ్యులు గుర్రం రామాంజనేయులు, శ్రీనివాసులు, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రభాకర్, బీఎస్పీ మండల అధ్యక్షులు రాము, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్సీ,ఎస్టీ ఐక్య వేదిక నాయకులు

సౌత్‌జోన్ వాలీబాల్ టోర్నమెంట్‌కు పివికెకె ఐటి విద్యార్థిని

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక రుద్రంపేటలో ఉన్న పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఐవి అంకిత సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ బండి రమేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెఎన్‌టియు అనంతపురం పరిధిలోని కళాశాలల మధ్య ఈనెల 19న కడపలోని కెఎస్‌ఆర్‌ఎం కళాశాలలో జరిగిన వాలీబాల్ పోటీల్లో అంకిత అత్యంత ప్రతిభ కనబరిచి సౌత్‌జోన్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఈ విద్యార్థిని డిసెంబర్‌లో తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో జరగబోయే సౌత్‌జోన్ టోర్నమెంట్‌లో పాల్గొంటుందన్నారు. కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్ మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థినీ, విద్యార్థులను ప్రోత్సహించడంలో పీవీకేకే ఐటీ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. వాలీబాల్‌లో మంచి ప్రతిభ కనపరచిన అంకితను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారి సింధూర, ప్రత్యేక అధికారి శ్రీనివాసులురెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి భార్గవి, పీడీ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినిని అభినందిస్తున్న పివికెకె యాజమాన్యం, సిబ్బంది

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళి

అనంతపురం : స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రెడ్డిసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎదురుగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా రెడ్డిసంఘం రాష్ట్ర అధ్యక్షులు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు గట్టిరెడ్డి బయపరెడ్డి మాట్లాడుతూ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాటం సాగించి తొలితరం స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ అన్నారు. అలాంటి మహనీయుని ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖరరెడ్డి, వడ్డిపల్లి గోపాల్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు సుర్యనారాయణరెడ్డి, టీవీరెడ్డి, పాటిల్ రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళులర్పిస్తున్న రెడ్డిసంఘం నాయకులు